# బొమ్మలు చెప్పిన భజగోవిందం

(నాటకం)

డి. విజయభాస్కర్

# బొమ్మలు చెప్పిన భజగోవిందం

## (నాటకం)

(తెర తొలిగింది. కేతిగాడు ప్రవేశించాడు)

**కేతి** : బంగారక్క! ఓ బంగారక్కా! ఏం చేస్తున్నావే?

**బంగా** : (లో నుండే) వంట పాత్రలు తోముతున్నాను.

**కేతి** : ఇప్పుడు నువు తోమాల్సింది ఆ పాత్రల్ని కాదు. ఇదిగో ఇక్కడున్న పాత్రల్ని.

**బంగా** : (ప్రవేశిస్తూ) అక్కడ పాత్రల్ని తోమడమేమిటయ్యా?

**కేతి** : అవును! ఆధ్యాత్మిక భావ జలధారల్ని మురుకుపట్టిన ఈ మనుష్యుల మీద చిలకరించి తోమితే తప్పా, ఈ సృష్టిలో మనిషి పాత్ర ఆవగింజంతని అర్థంకాదు. మనిషిని పతనం చెయ్యడంలో ధనం పాత్రేమిటో బోధపడదు. ఆ ధనార్జన కోసం మనిషి ఎన్నెన్ని దుష్ట పాత్రల్ని ధరిస్తున్నాడో తెలిసిరాదు.

**బంగా** : ఏంటీ ఇదంతా నీ పాండిత్యమే.

**కేతి** : ఇది నా పాండిత్యం కాదు – ఆది శంకరులది

**బంగా** : ఆది శంకరులదా! చాల్లే! అది వింటే నీరసం వస్తుంది.

**కేతి** : నీరసం రావడమేంటీ – బుద్ధి లేకుండా మాట్లాడుతున్నావు. అతని వేదాంతాన్ని వింటే మనసంతా ఆనందంతో నిండిపోతుంది.

**బంగా** : కడుపు మాత్రం ఆకలితో మండిపోతుంది.

**కేతి** : ఆయనన్నట్టు అహాన్ని సోహంతో కలిపితే అనుక్షణం ఆత్మానందంలో మునిగిపోవచ్చు.

**బంగా** : ఆత్మ, పరమాత్మా – రెండూ నేనేనని శుష్క వేదాంతంలో తేలవచ్చు.

**కేతి** : జీవితం క్షణభంగురం. ఈ క్షణ కాలం కోసం ఈ ఆరాటాలూ, పోరాటాలు అవసరం లేదంటాడు, భ్రమాజనితమైన ఈ ప్రపంచం శాశ్వతం కాదంటాడు.

**బంగా** : ఏమయ్యా! ఒక్క మాట విను. ఎంత గొప్ప వేదాంతమైనా సమకాలీన సమాజాన్ని ప్రభావితం చేసినప్పుడే అది సిద్ధాంతమౌతుంది. లేకపోతే కేవలం ఓ రాద్ధాంతంగా మిగిలిపోతుంది.

**కేతి** : అంటే నీ ఉద్దేశ్యం ఏంటీ? శంకరులు చెప్పినవి సమకాలీన సమాజానికి వర్తించవంటావా?

**బంగా** : నువ్వనేదేంటి? ఆయన చెప్పినవి ఈనాటి పరిస్థితులకు వర్తిస్తాయంటావా?

**కేతి** : అవును

**బంగా** : ఏది వర్తిస్తుందో ఎలావర్తిస్తుందో చెప్పు!

**కేతి** : చెబుతాను. ఎప్పుడూ నిశ్శబ్ధంగా వుండే ఆకాశం అప్పుడప్పుడు ఉరుములై గర్జిస్తుంది. నిత్యం తనలో తానే నిభాయించుకొనే సముద్రం కోపం వస్తే ఉప్పెనగా ముంచెత్తుతుంది. అలాగే.... మూఢాచారాలతోను దుష్ట సాంప్రదాయాలతోను స్తబ్ధంగా, నిస్తేజంగా ఉండే హైందవ సమాజంలో ఆధ్యాత్మిక తత్త్వతరంగంగా, అద్వైత గర్జనగా శంకరుల వారొచ్చారు. ఆయన ఆత్మవిలాసం, మనీషాపంచకం, వివేక చూడామణి, భజగోవిందం లాంటి అద్భుతమైన గ్రంథాలు రచించారు. వాటిలో మకుటాయ మానమైన భజగోవిందంలో శంకరులు చెప్పిన ఆధ్యాత్మిక సారాన్ని మనం ఈనాడు ఈ నాటక రూపంలో ప్రేక్షకులకు అందించబోతున్నాం.

**బంగా** : ఏంటీ భజగోవిందాన్ని నాటకంగానా? దాంట్లో కథలేదూ, పాడూ లేదూ అదేమి నాటకమయ్యా?

**కేతి** : ఏమి నాటకమో చూస్తే నీకే అర్థమౌతుంది.

**బంగా** : ప్రతి శ్లోకంలోనూ "భజగోవిందం భజగోవిందం మూఢమతే" అన్నాడు. అంటే గోవిందుని భజించరా ఓ మూఢుడా అని మనిషిని పట్టుకుని తిట్టాడు.

**కేతి** : అది తిట్టుకాదు.

**బంగా** : అది తిట్టేరా మూర్ఖుడా!

**కేతి** : ఇదిగో నన్ను మూర్ఖుడా అనొద్దు.

**బంగా** : చూశావా! కేవలం నువ్వొక బొమ్మవు! మూర్ఖుడా అంటే నీకే అంత పొడుచుకొచ్చిందే... జ్ఞానవంతుడైన మనిషిని మూఢుడా అని అనడం సమంజసమా? పైగా శంకరుడు అద్వైత సిద్ధాంతకర్త – అంటే జీవుడు, దేవుడు ఒక్కడే అని చెప్పిన పెద్దమనిషి – జీవుడి నుండి దేవుడ్ని వేరు చేసి అతడ్ని భజగోవిందమని చెప్పడం ఎంత వరకు సరైందో నువ్వే ఆలోచించు.

**కేతి** : చూడూ! నీతో వాదన చేయడం నా వల్లకాదు కానీ ఒక్క మాట మాత్రం నిజం.

**బంగా** : ఏంటది?

**కేతి** : మనిషికి భగవన్నిష్టను; ఆత్మనిష్టను కలిగించే అనేక విషయాలపై శంకరులు ఉపదేశించారు. అవి అన్ని కాల మాన పరిస్థితుల్లో మానవులకు శిరోధార్యం. ఈ నాటకం చూస్తే నీకు తెలుస్తుంది. భజగోవిందం యొక్క విశిష్టత - గొప్పదనం ఏంటన్నది. ఎంత రసానుభూతిని పొంది ఆత్మానందం కలుగుతుందో!

**బంగా** : నువ్వన్నట్టు నిజంగా నాకు అంతటి ఆత్మానందమే కలిగితే అప్పుడు ఒప్పుకుంటాను భజగోవిందం చాలాగొప్పదని.

**కేతి** : ఒప్పుకోవడం కాదు - నాటకం పూర్తయ్యేసరికి మన భావాలతోపాటు స్వభావాలూ మారిపోతాయి.

**బంగా** : అదీ చూద్దాం. వెయ్యించు నాటకం. (మంత్రి గారి నివాసం - పి.ఎ. వేణు సెల్‌లో మాట్లాడుతున్నారు)

**వేణు** : ఆ నమస్కారం! ఎవరూ ఎం.ఎల్.ఎ. పి.ఎ. నా? నేను మినిష్టర్ పి.ఏ.ని. నమస్కారం. ఓర్నీ! నేను నీకు నమస్కారం పెట్టడంలేదయ్యా! నువు పెడితే నేను రిసీవ్ చేసుకుంటున్నా. ఏంటి సంగతులు? హైదరాబాద్ వచ్చావా? సాయంత్రం కలుద్దాంలే. ఆ! లక్డీకపూల్! ఓ.కె. కలిశాక చెబుదువులే. (కాల్ కట్ చేసాడు. వెంటనే మరో కాల్ వచ్చింది).... ఆ! సార్! నమస్తే సార్ (లోనకు చూసాడు). (ఆఁ! నమస్తేసార్) (లోనకు చూసాడు) ఆఁ! రడీ అయిపోయారు. వచ్చేయండి సార్! ఇంట్లోనే ఉంటున్నారు. (రెడ్ బటన్ ప్రెస్ చేసాడు. మళ్ళీ వెంటనే ఫోన్ వచ్చింది) హల్లో! ఏంటోచెప్పు. నిన్నీసారీ మా ఆఫీస్ మెట్లెక్కనివ్వను జాగ్రత్త! ఏంటి చెప్పేది! ఎన్నిసార్లు చెప్పాలి. (అప్పుడే గాయత్రిదేవి బయటకొచ్చింది. అయితే పి.ఏ. ఆమెను చూడలేదు గనక చెప్పుకుపోతున్నాడు). ఈసారి తేకపోతే ఒప్పుకోను. రాసుకో పెట్టుబడి కాల్స్ నాలుగు, మొక్కుబడి కాల్స్ పన్నెండు, చేతబడి కాల్స్ ఎనిమిది. సాయంత్రం కలువే.

**గాయత్రి** : ఏంటయ్యా! ఏదో వర్గీకరణ చేసి చెబుతున్నావ్.

**వేణు** : ఏమీ లేదమ్మా!

**గాయత్రి** : నేను విన్నాను. చెప్పు పర్వాలేదు.

**వేణు** : అదేనమ్మా! మాల, మాదిగల వర్గీకరణ పోరాటం నడుస్తోంది కదా! దాని గురించి చెబ్తున్నాను.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Bommalu+Cheppina+Bhajagovindam**

* * *